కథానిక:

# "దుక్కిటెద్దు దేశాంతరం"

★

"వీరయ్య చెప్పకుండా యిల్లు విడిచి వెళ్ళిపోయాక, పొరుగింటి రామయ్యనాయుడు, మంగమ్మతో యిలా గన్నారు వీరయ్యని, చిన్నతనంలో తల్లీ, తండ్రీ పోయినా యింత కాలంవరకూ ఆదెయ్య పెంచాడు. గాని, చివరికి మాట దక్కించుకోలేక పోయేగు తన తమ్ముడూ, మరదలు సీతాలక్ష్మి చనిపోయాక వాళ్ళు లేని లోటును కనపడనీకుండా, తనబిడ్డకంటె ఎక్కువగానే చూచాడు వీరయ్యకి, పొలంపన్లు లేకుండా చదువు చెప్పించాడు ఆదెయ్య ఎంతచేసి ఏం లాభం? వంకాయమ్మ సూటిపోటి మాటలకే, కోడల్ల కొరపనగొయ్య తనానికే విసుగెత్తి, ఎనిమిదో క్లాసు చదువుతున్న వాడల్లా చెప్పకుండా పారిపోయాడు "పాపం! తల్లీ తండ్రీ లేని బిడ్డ"! వాడిభాగం "పాతికెకరాలూ," తనే వేసుకుందామన్న తలంపుతోనే చేసిందేమో వంకాయమ్మ"

ఇదే విధంగా, రెండు రోజులకల్లా వూరంతా అట్టుడికి నట్టుడికింది. ఆదెయ్య మాత్రం, వీరయ్య చెప్పకుండా వెళ్లిపోయినందుకు చింతపడ్డాడు గాని, తనకొడుకులూ వెంకాయమ్మా మాత్రం అనుకోనగూడా అనుకోలేదు "మేమంతా, పగలల్లా ఎండలోమాడి, రాత్రిళ్లు పురుగనక బుట్రనక కాపలాకాసి కష్టపడి పండించుకు రావాలి, నీ తమ్ముడికొడుకు, యాళకు నీడపట్టున మెక్కి సదువు సదువుతాడంట, ఆడికేం కొమ్ములొచ్చినయ్యా! అదేమంటే, అమ్మాఅబ్బా లేని పిల్లోన్నిన కేసుకొస్తాడు" అని అన్నాడు ఆదెయ్యవిచారిస్తుంటే, పెద్దకొడుకు సత్యం.

అమ్మా, అబ్బా లేని వీరయ్య, పెద్దమ్మ, అన్నలూ, వదినెలూ పెడుతున్న బాధలకి వోర్పలేక తిన్నగా రాజమండ్రి చేరుకున్నాడు. ఏనాడూ, యిల్లు విడిచి పొరుగూరు పోయినవాడు గాదు - తన యిల్లెమో వాకిలేమో తప్ప. ఆ వూళ్లో తనని, ఆదరించి అన్నం ఎవరు పెడతారు? ఇదే ఆలోచనలో పడ్డాడు వీరయ్య. ఆ నాటిరాత్రి రైలుస్టేషనులో పడుకొని నిద్రపోయాడు, పొద్దున్నే లేచి, వూళ్లోకి వెళ్లాడు, వూళ్లో ఎవరిదగ్గరన్నా జీతానికి కుదురుదామని నాలుగిళ్లూ తిరిగాడు. ఆఖరికి, తాసిల్దారు సుందరంపంతులుగారి ఇంట్లో పనిచెయ్యడానికి కుదిరాడు.

ఆదెయ్య పక్కపక్క వూళ్లన్నీ వాకబు చేయించి చూచాడు, గాని వీరయ్య జాడ తెలీలేదు. కొద్దిరోజులు విచారపడ్డాడు. క్రమంగా వీరయ్య సంగతే మరిచిపోయిందా కుటుంబం.

వీరయ్యకి మొదట్లో పిల్లల్ని ఎత్తుకోడం, కూరగాయలు తేవడం, బజారుసామాన్లు మొయ్యడం యిల్లాంటి పన్లు చెపుతుండేవాళ్లు. వీరయ్యమాత్రం కాలం వృధాపుచ్చకుండా పిల్లల్ని ఆడిస్తూ ఆ పుస్తకం, ఈ పుస్తకం చదువుతుండేవాడు. అగివరకంతో, ఎనిమిదో క్లాసు చదివాడు గనక, కొంత బాగా చదువుని అభివృద్ధి చేసుకున్నాడు. సుందరంపంతులు భార్య జయమ్మగారుకూడా, వీరయ్య తెలివితేటలు కలవాడనీ, బజారుపన్లలో చాకచక్యం చూపిస్తాడనీ మెచ్చుకుంటూండేది.

రెండేళ్లు కులాసాగా ఆనందంతో గడిచిపోయాయి వీరయ్యకి. యిప్పుడు పిల్లల్ని పంతులుగారి స్వంతబండిలో స్కూలుకి తీసికెళ్లడం, యింట్లో నీళ్లు మోయడం, గుడ్డలుతకడం, యిలాంటి పన్లకూడా చెప్తున్నారు. ఇవన్నీ పూర్తి చేశాక, పంతులుగార్ని కచేరీకి తీసికెళ్లి, మళ్లా యింటికొచ్చి, పిల్లల్ని మధ్యాహ్నం అన్నానికి తీసుకురావడం, మళ్లా వాళ్లను బళ్లో దింపడం, పంతులుగార్ని మళ్లా యింటికి తీసుకురావడం, ఈ లోపల ఖాళీలో అమ్మగారు చెప్పిన పని చెయ్యడం వీటి మూలంగా తీరికలేక చదువుకోటానికే వీలయ్యేదికాదు వీరయ్యకి.

యిట్లా కొన్నాళ్లన్నా కష్టపడి, నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకుని ఏ కొల్లోనన్నా గుమాస్తాగిరి చేద్దామని వీరయ్య తలంపు గాని, అమ్మగారు ఎక్కడా తీరికలేకుండా ఏదో పని చెబుతూనే ఉండేది. యిలా కష్టపడుతూనే, తలకాయొంచుకుని, తల్లీ తండ్రిని తల్చుకుని ఒక ఏడుపువిడ్చి తన దుస్థితికి చింతిల్లుతూండేవాడు. రోజు లెలాగో గడిచిపోతున్నాయి గాని, వీరయ్య స్థితిలోమార్పేమీ కనిపించలేదు. సుందరం పంతులుగారు తిండీ, గుడ్డా యిస్తారుగాని దమ్మిడీ అన్నా యిచ్చేవారు గారు, అఖరికి కొనుక్కుతింటానికన్నా.

ఎన్నినాళ్లనుభవిస్తాడు వీరయ్య ఈ కష్టాల్ని? ఎంతో ఓర్పుతో, జాగరూకతతో ప్రవర్తిస్తున్నాడు. ఓనాడు వీరయ్య పంతులుగార్ని కచేరీకి తీసుకుపోయి ఇంటికి వస్తూ తన భవిష్యత్తును గురించి ఆలోచనలో పడ్డాడు. పోనీ మళ్లా యింటికి పోదామా అనుకున్నాడు, "ఛీ! నాల్గేళ్లనాడు యిల్లు విడిచి వచ్చి మళ్లా వాళ్ల ముఖం చూస్తానా అనుకున్నాడు. పోనీ యింకెదన్నా నౌకరి చూసుకుందామా అంటే, ఎక్కడికి వెళ్లినా చాకిరీ తప్పదు గాని, కొద్దోగొప్పో చదువుకుని గూడా ఆడవాళ్ళ బట్టల దగ్గరనుంచీ ఉతకవలసివచ్చిందిగదా అని వాపోయాడు. ఎన్నెన్నో ఆలోచనలు బుర్రలో తిరిగాయి గాని "అమ్మగారు ప్రేమతో పెట్టే అన్నం మెతుకులు" విడిచేలా పోవడం, నాల్గేళ్లగాఉన్నామే! చిన్నబ్బాయి "గోపి"ని విడువగలనా? అనుకున్నాడు. యింతలో ఎద్దు గేటుదాటి సరాసరి అది మామూలుగాపోయి నిల్చే చోట ఆగింది. వీరయ్య భావప్రపంచంలో కళ్లుమూసుకుని అదే ధ్యాసగా ఉన్నాడేగాని ఎక్కడికొచ్చామా అన్న స్పృహ లేదు. యింతలో అమ్మగారు వచ్చి, "ఏంరా వీరయ్యా!" ఇంకా అలా మొద్దల్లే బండీలోనే కూచొని నిద్దర పోతే పిల్లల్ని అన్నానికి ఎవరు తీసుకువస్తార్రా! అంది కోపంగా. వీరయ్య ఉలిక్కిపడి చూశాడు "ఏంరా యింకా అలానే చూస్తావేం!" గంటయిపోయింది. పొద్దున పదిగంటలకి కచేరీకి పోయినవాడివి ఇంతదాకా ఏం ఎలగబెడుతున్నావ్? నిన్నడిగేవాళ్లు లేరని యిష్టమొచ్చినట్లు బండేసుకొని, ఊరంతా తిరిగొచ్చావా

(28-వ పేజీ చూడండి)

రచన
శ్రీ శ్రీనివాస కాశ్యప

# "దుక్కిటెద్దు దేశాంతరం"

(15-వ పేజీ తరువాయి)

ఏమిటి? అంది అమ్మగారు పాఠ మొప్పజెప్పినట్లు

"వీరయ్యా సమాధానం చెప్పకుండా, బండిని అట్లాగే మలుపుకొని బడిదగ్గరకి వెళ్లాడు"

ఒకరోజుకంటే ఒకరోజు వీరయ్యకి కష్టాలు జాస్తయినాయి ఎంత కష్టపడి పనిచేసినా, అమ్మగారికి తృప్తిలేదు కాసేపు కూచున్నా "గోళ్ళు గిల్లుకుంటూ" అలా కూచున్నావేంరా చెట్లకు నీళ్లన్నా పొయ్యక" అనేది అమ్మగారు చెప్పిన పనులన్నీ ఓర్పుతో చేస్తూనే వచ్చాడు ఓనాడు సుందరం పంతులుగారు ఏ ఖర్చులకనో జయమ్మగారికి డబ్బిచ్చి పోయారు, కచేరీకి వారితోపాటే వీరయ్య కూడా బండి తోలుకొని వెళ్ళాడు

పంతులుగార్ని కచేరీకి తీసుకెళ్లి తిరిగి వీరయ్య వచ్చేసరికి "ఏంరా వీరయ్యా!" నడవాలో కొచ్చినప్పుడు డ్రాయరుమీద వున్న "పదిహేను" రూపాయలున్నా చూశావా? అని ప్రశ్నించింది వీరయ్యకి కాళ్లూ చేతులూ వణకసాగాయి, నిర్ఘాంతపోయి చూస్తున్నాడు మళ్లా జబర్దస్తీగా గదమాయించింది అమ్మగారు "ఏ పాప"మూ ఎరుగని వీరయ్యేం చెబుతాడు? యిలానే మధ్యాహ్నందాకా తర్జన భర్జనలు జరిగాయి వీరయ్య తన మామూలు పనులన్నీ సాయంత్రానికి నిర్వర్తించాడు

సాయంత్రం పంతులుగారు రాగానే, ఈ "కేసు" విచారణ కొచ్చింది పంతులుగారు సామ, దాన, భేద దండోపాయాల్తో ప్రయత్నించి చూచారు కాని, వీరయ్య నోటంట "తెలీద"న్న ఒక్క మాట తప్ప యింకోటి చెప్పించలేకపోయారు వీరయ్య కన్నీరు మున్నీరుగా ఏడవడం తప్ప యింకోమాట నోటంట రాలేదు పంతులుగారాలోచించి, ఆలోచించి, భార్యనడిగారు "ఏమేవీడిమీద అనుమానముందా?" అని "ఏమో?" మీ రాఫీసుకు వెళ్లేటప్పుడు బండిలో తివాసీ వెయ్యటానికని నడవాలోకి వచ్చాడు మీ రప్పుడే యిచ్చినరూపాయలు డ్రాయరుమీద పెట్టున్నాయంది

ఏమయితే ఏం పంతులుగారు, నాల్గేళ్లగాఉన్న వీరయ్యమాటని విశ్వసించలేకపోయారు "ధనమూల మిదం జగత్" కదండీ! ఎలా నమ్మగలరు? వాడికా రాత్రి అన్నం కూడా పెట్టకుండా, యిల్లు విడిచిపోవలసిందిగా ఆర్డర్ పాస్ చేసి వెళ్లగొట్టారు

వీరయ్య రాత్రి యిల్లు విడిచి వెళ్లిపోయాక, ఏదో పని మీద వంటింట్లోకి వెళ్లిన జయమ్మగారికి అల మరతీయగానే పదిహేను రూపాయలూ కనిపించాయి వెంటనే ఆమె గుండెలు కొట్టుకో నారంభించాయి ఒక పక్క ఏపాపమూ ఎరుగని వీరయ్యని దండించి వెళ్లగొట్టినందుకూ, ఇంకో పక్క తాను చేసిన తప్పిదానికి ఇంకో ప్రాణిని అప్రతిష్ఠపాలు చేసినందుకూ, తీరా ఈ సంగతి పంతులుగారికి తెలిస్తే ఏమంటారో నని ఆమె కుమిలిపోజొచ్చింది గాని, తాను చేసిన ఈతప్పిదాన్ని పంతులుగారికి చెప్పకుండా దాచలేకపోయింది, యికనైనా వీరయ్యని వెతికి తీసుకురావచ్చునన్న ఊహతో వెంటనే వెళ్లి పంతులుగారాఫీసు రూములో కూచుని ఏవో ఫైల్సు చూసుకుంటూంటే, వెళ్లి నిశ్చేష్టురాలై నిలబడింది

పంతులుగారు ఫైల్సు చూసుకుంటూ, చూసుకుంటూ తలెత్తి చూచేసరికి భార్య కనిపించింది 'కళావిహీనం'గా వున్న భార్యముఖాన్ని తదేక దృష్టితో చూస్తున్నాడు సూర్యకాంతులకు వికసించు పద్మంలా, తన్ను చూచేసరికి కళకళలాడుతూ ఆనందాతిరేకంతో సంభాషించే ప్రియురాలి మోము మాచి కొయ్యబారిపోయాడు పంతులుగారు

జయమ్మగారికి నోటమాట రావటంలేదు అడగడానికి పంతులుగారి కంతకన్నా నోరాడటంలేదు కాస్సేపటికి తెప్పరిల్లి కాని "ఇవిగోనండీ రూపాయలు" అంది భార్య సుందరంపంతులుగారు ఒక్కమారు ఆపాదమస్తకం కంపించిపోయారు వీరయ్య నిజాయితీకి విలువకట్టలేకపోయారు వెంటనే పిచ్చెత్తినవాడిలా, బజార్నబడి "వీరయ్యా! వీరయ్యా!" అంటూ వీధులూ, రైలుస్టేషనూ అన్నీ గాలించివచ్చారు ఎక్కడున్నాడు వీరయ్య? ఆనాటి రాత్రే భలానిపిల్లకాయ రైలెక్కి మద్రాస్ వైపు వెళ్ళాడని అక్కడి వాళ్లు చెప్పారు సుందరంపంతులుగారు విచారవదనులై యిల్లు చేరుకున్నారు సుందరంపంతులుగారి కుటుంబం వీరయ్యని మరుద్దామన్నా మరువలేకపోయింది

వీరయ్య మర్నాటికి మద్రాస్ చేరుకున్నాడు టిక్కెట్ కలెక్టర్లనందర్నీ తప్పించుకొని స్టేషన్లో ఓమూలకూచొని తనకు తెల్సినవాళ్లపిల్లాడు అవ్రాల్లో ఉన్నాడన్న విషయం జ్ఞాపకం చేసుకున్నాడు ఎక్కడున్నాడో ఎలా తెల్సుకోడం! ఈమహాపట్నంలో అనుకున్నాడు తెల్సుకున్నా యిన్ని సంవత్సరాలనాడు పారిపోయొచ్చిన నా సంగతాయనకు జ్ఞాపకం ఉంటుందా! ఉన్నా, మావాళ్లతో చెప్తాడేమో! కనబడితే అనుకున్నాడు వీరయ్య కొంత సేపాలోచించుకొని దారీ తెన్నూ తోచక, నిమ్మదిగా టౌన్లోకి నడిచాడు అవీ ఇవీ చూసుకుంటూ నడుస్తున్నాడు. అప్పటికి పదకొండుగంటలవేళ దాటుంటుంది ఎండవేడిమి జాస్తిగా వున్నది నెత్తిమాడుతూ, కడుపుకాల్తూ ఉన్నాయి గతదినం తిన్నతిండి, ఏ హోటల్కోపోయితిందామా అంటేచేతిలో ఎర్రనిఏగానీ లేదు నానా బదములాపడి ఎలాగో చేరుకోటమే గగనమయిందాయెను, యింతలో ఆ ప్రక్కనే "ఆంధ్రాకేఫ్" అనే పెద్దపెద్ద అక్షరాలతో ఓ హోటల్ కనిపించింది దాన్ని మాడగానే ఎప్పుడూ మదరాసు చూడని వీరయ్యకి యిక్కడ గూడా "మనవాళ్లున్నారే!" అని సంతోషాశ్చర్యాలు కలిగాయి యిన్నాళ్లూ మదరాసులో "అంతా అరవమే" అనుకుంటున్నాడు వీరయ్య కాని యిప్పుడు తెలుగవాళ్లకుకూడా యిక్కడ మంచి స్థానమే ఉందనీ, మనవాళ్లుకూడా యిక్కడ పెద్దపెద్ద వ్యాపారాలు చేస్తున్నారనీ, తెల్సుకోగలిగాడు నిమ్మదిగా హోటల్లో అడుగుపెట్టాడు లోపలికి వెళ్లి "కాఫీ ముందర' బ్రమీసాలూ, అమెరికన్ కటింగ్

తెలుగు మెఱుగులు

గ్రంథకర్త

వేటూరి ప్రభాకరశాస్త్రి

వెల రు. 2-0-0

తపాలా ఖర్చులు 0-8-0

మేనేజరు- ఆంధ్రగ్రంథమాల,

నెం 7, తంబుచెట్టి వీధి, మదరాసు-1

క్రాఫూ, వేళ్లకు ఉంగరాలూ అతిరిచిగా కూచున్న యజమానిని చూచి ఎవరో కమ్మనాయుడల్లే ఉండే అనుకున్నాడు వీరయ్య

నిమ్మదిగా యజమాన్ని సమీపించాడు సమీపించి తన దీనావస్థను చెప్పుకున్నాడు "ఈ పూట భోజనం పెట్టించా" లని మెల్లగా అడిగాడు ఎంత సుదరాసు అరవవాళ్లతో స్నేహంచేస్తున్నా పోగా మిగిలిన ఆంధ్రత్వాన్ని నిలబెట్టుకోటాని కన్నట్లు అలాగే చెయ్యబ్బాయీ అని ఒక సర్వర్‌ను పిలిచి ఏమో చెప్పాడు వీరయ్య లోపలికి వెళ్లి భోజనానికి కూచున్నాడు అంతా అరవగోడుగా ఉన్నది బోర్డుమాత్రమే ఆంధ్రత్వాన్ని సూచిస్తున్నది గాని, లోపల పదార్థాలూ, మనుషులూ అంతా అరవగోడుగా తోచింది వీరయ్యకి ఎలాగో ఈ పూటకి తన క్షుద్బాధ కొంత తీరింది కదా అనుకుని ఆ 'నాల్గు రేషన్ మెతుకు'లూ ఫలహారంలా నోట్లో వేసుకొని బయట పడ్డాడు

పోతూ, పోతూ యజమానిని కల్సుకొని అయ్యా! ఏదయినా నాకు నౌకరీ యిప్పించకూడదా? మీ హోటల్‌లో అని ప్రశ్నించాడు ఏంపని చెయ్యగలవని అడిగాడు యజమాని ఏపని చెయ్యమన్నా చేస్తానన్నాడు వీరయ్య అయితే మా హోటల్‌లో సర్వర్‌గావుండు, భోజనం పెట్టి పదిరూపాయలు యిస్తానన్నాడు యజమాని వీరయ్య అందుకు సంతోషించి సరేనని ఒప్పుకున్నాడు

మర్నాటినుంచీ వీరయ్య పనిలో ప్రవేశించి చేస్తున్నాడు వీరయ్యే తెలుగొచ్చిన వాడవటంచేత, యజమాని యింటిపన్లను కూడా చేయించుకుంటున్నాడు వీరయ్యకి మొదట నాల్గయిదురోజులు [illegible] కష్టంగా తోచలేదుగాని, క్రమంగా, సుందరం పంతులుగార్నే మేలనిపించేడు అలానే అన్నిటికీ ఓర్చి, కష్టాలు "కాపురముంటాయా" అన్నమాట జ్ఞాపకం చేసుకుని పనిచేసుకుపోతున్నాడు వీరయ్య

ఒకనాడు, సర్వు చేస్తుండగా వీరయ్యను చూచాను ఏడేళ్లనాడు, రామయ్యనాయుడిగారి ఇంట్లో వెళ్లిపోయాడనుకున్న వీరయ్యని ఈనాడీ హోటల్‌లో చూడగలిగాను నేను వెళ్లి కుర్చీలో కూచోగానే నన్ను చూచి వీరయ్య నిర్ఘాంతపోయాడు కొంతసేపయాక నన్ను సమీపించి, కుశల ప్రశ్నచేశాడు ఆ మాటా మాటమీద మా వూరి కబుర్లొచ్చాయి ఆదెయ్యకి జబ్బుగావుందనీ, నిన్ను చూడాలని మనసులో చాలా బాధపడుతున్నాడనీ, నిన్ను చూచి, ఆ కొస్త ప్రాణం విడవాలని ఉగ్గబట్టుకు ఉన్నాడనీ వీరయ్యకి చెప్పాను వీరయ్యకూడా, వెళ్లాలన్న ఉత్సాహాన్నే కనబరిచాడు పూర్వపు విరోధాన్ని మరిచి వెంటనే యజమాన్ని శెలవు గావాలని అడిగొచ్చాడు కాని యజమాని శెలవివ్వడం సాధ్యపడదనీ, యిష్టముంటే ఉండమనీ లేకపోతే నీ యిష్టమనీ అన్నాడు వీరయ్యకి చాలా దుఃఖమూ, కోపమూ ఒకేమారు వచ్చాయి అంత ప్రమాద స్థితిలో ఉన్న మనిషిని చూడ్డానికూడా శెలవివ్వని ఉద్యోగం ఎందుకనుకున్నాడు వీరయ్య నేరుగా నాదగ్గరకువచ్చి ఈ విషయమంతా చెప్పి, నకు రావాల్సిన డబ్బు తీసుకుని, హోటల్ యజమానికి "గుడ్ బై" చెప్పి, "దుక్కిటెద్దు దేశాంతరం"లాగే అయింది నా బ్రతుకు అనుకుంటూ, నాతోపాటే ఆవాళ మెయిలెక్కాడు వీరయ్య కాసేపటికి మెయిలు కదిలింది రైలుకూడా, "దుక్కిటెద్దు దేశాతరం" అన్నట్టే తోచింది వీరయ్యకి రైలు వేగంగా పోతున్నకొద్దీ ఆదే మననం చేస్తూ, స్వస్థానం చేరాడు వీరయ్య ★

---

"స్నేహితుడిని కనక చెప్పాలి సొచ్చింది శంకరం నిన్ను గురించి చాలా అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడు"

"దానికేంలే? వాడు నన్ను గురించి నిజంచెప్పటం మొదలు పెట్టినప్పుడు చెప్పు, వాడి భరతం పట్టిస్తా"

* * * *

లాయరు అయ్యా, కోర్టు రామాయణాన్ని తమ కుక్క తినేసింది

న్యాయమూర్తి అయితే సాక్షిని కుక్కను నెత్తిన పెట్టుకుని ప్రమాణం చెయ్యమనండి కొత్త రామాయణంకోసం కేసు వాయిదా వెయ్యాలిసొస్తుంది.

* * * *

"మర్యాదంటే ఏమిట్రా, అన్నయ్యా?"

"కావాలని ఉన్నప్పుడు అక్కర్లేదనటం."